1600 మంది శిశువులు జననం

పలువురికి 'దానా'గా నామకరణం



కటక్‌లోని నియాలి ఆసుపత్రిలో జన్మించిన శిశువుతో తల్లిదండ్రులు


రాయగడ పట్టణం, భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఓ వైపు దానా తుపాను ప్రభావం చూపుతుండగా, మరోవైపు 1600 మంది శిశువులు ఈ లోకంలో అడుగుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల్లో 1600 మంది శిశువులు జన్మించినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. వీరిలో పలువురికి 'దానా' అనే నామకరణం చేయగా, మరి కొంత మంది ఇదే పేరును పెట్టేందుకు ఆలోచన చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 6 వేల మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాల్లో ఉన్న వివిధ ఆసుపత్రులకు తరలించారు. భద్రక్ జిల్లా దమ్‌నగర్ సమితి కంటిక గ్రామానికి చెందిన శుభమల్లిక్ అనే గర్భిణి దుసురి ఆసుపత్రిలో జన్మనిచ్చిన మగబిడ్డకు 'లిటిల్ దానా' అని నామకరణం చేశారు. కటక్ జిల్లా నియాలి ఆసుపత్రిలో సాయి స్వప్నబెహరకు జన్మించిన మగ శిశువుకు ఈ పేరే పెట్టినట్లు ఆయా ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. దీనిపై శుభ మల్లిక్ అనే బాలింత స్పందిస్తూ...తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆసుపత్రిలో చేరాల్సిందిగా జిల్లా యంత్రాంగం నుంచి ఫోన్ కాల్ వచ్చిందన్నారు. వెంటనే కుటుంబ సభ్యుల సహకారంతో ఆసుపత్రిలో చేరాం. ఇక్కడే పురిటినొప్పులు మొదలై మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. ఇది మా కుటుంబంలో ఎంతో సంతోషాన్ని నింపిందని, అందుకే తమ బిడ్డకు దానా అని నామకరణం చేశామన్నారు.



కేంద్రపడ జిల్లా రాజ్‌నగర్ రహదారిపై పడిన చెట్లను కోసి తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దయ చూపిన దానా

- బలహీన పడటంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు
- భితర్‌కనికా వద్ద తీరం దాటిన తుపాను
- రెండు జిల్లాల్లో నష్టం



గోపాల్‌పూర్, న్యూస్‌టుడే

తీవ్ర భయాందోళనకు గురి చేసిన దానా తుపాను ఒడిశాపై దయ చూపింది. గురువారం రాత్రి 1.30 గంటలకు భితర్‌కనికా, ధమ్రాల మధ్య హబాలిఖతి వద్ద తీరం దాటింది. ఈ ప్రక్రియ శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు కొనసాగింది. తీరం దాటే సమయంలో గంటకు 110 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉండవచ్చని వాతావరణ శాఖ తొలుత అంచనా వేసింది. కానీ 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో గాలి వీయడంతో అంతగా ప్రభావం చూపలేదని గోపాల్‌పూర్ ఐఎండీ కేంద్రం అధికారి ఉమాశంకర్‌దాస్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. తీరం దాటే ముందే తుపాను బలహీన పడినట్లు స్పష్టం చేశారు. భితర్‌కనికా అటవీ ప్రాంతం కావడంతో గాలుల తీవ్రత గ్రామాలపై పడకుండా అడ్డుకట్ట పడిందని, వాయుమండలంలో అనుకున్నంత తేమ లేకపోవడంతో వర్షపాతం తగ్గిందన్నారు.

అక్కడే గాలులు

గాలుల తీవ్రత కేంద్రపడ, భద్రక్ జిల్లాల్లో గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల వేగం నమోదైందన్నారు. బాలేశ్వర్‌లో 60 నుంచి 70 కిలోమీటర్లు ఉందన్నారు. పూరీ, జగత్సింగ్‌పూర్ తీర జిల్లాల్లో 40 లోపు కాగా, మరో తీర జిల్లా గంజాంలో ప్రభావం ఏమీ లేదన్నారు.

వర్షపాతం ఇలా..

భద్రక్ జిల్లాలోని ధమ్రాలో 16, కేంద్రపడ జిల్లాలోని రాజ్‌కనికాలో 16 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందన్నారు. మయూర్‌భంజ్ జిల్లా నవానలో 14, కేంద్రపడలోని మర్సాఘయిలో 11, భద్రక్‌లోని బాసుదేవపూర్‌లో 11, బాలేశ్వర్ జిల్లాలోని ఔపదలో 11, కేంద్రపడలోని రాజ్‌నగర్‌లో 10, మహాకాళపడలో 9, జగత్సింగ్‌పూర్ జిల్లాలోని పరదీప్‌లో 8 సెంటీమీటర్ల వాన కురిసిందని, ఈ నాలుగు జిల్లాల్లోని మరో 12 కేంద్రాల్లో 6 నుంచి 5 సెంటీమీటర్ల చొప్పున నమోదైందన్నారు.



శుక్రవారం ఉదయం ధమ్రా బలరాంగడి ఫిషింగ్ హార్బర్ వద్ద పెనుగాలులకు విరిగి పడిన యంత్రాలు

నేడు మోస్తరు వానలు

తీరం దాటిన దానా బలహీనపడి శుక్రవారం సాయంత్రం వాయుగుండంగా భూమ్మీద కొనసాగుతోందన్నారు. ఇది పశ్చిమ, ఉత్తర దిశగా ప్రయాణిస్తోందని, మరో 12 గంటల వరకు ప్రభావం ఉంటుందన్నారు. శనివారం మయూర్‌భంజ్, బాలేశ్వర్ జిల్లాల్లో మోస్తరు వర్షాలకు అవకాశం ఉన్నందున 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు. మిగతాచోట్ల వాతావరణం పొడిగా ఉంటుందని దాస్ తెలిపారు.



కేంద్రపడ జిల్లా తలచువా గ్రామంలో తీరం దాటి ముందుకొచ్చేసిన సముద్రం



భువనేశ్వర్‌లోని రెడ్‌క్రాస్ భవనంలో రిలీఫ్ సామగ్రి ప్యాకింగ్ పనులు పరిశీలిస్తున్న సీఎం మోహన్

ముఖ్యమంత్రి నిరంతర పర్యవేక్షణ

రాత్రంతా మేల్కొని అధికారులకు సూచనలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలంటారు. ఎన్నో తుపానులు ఒడిశాపై విరుచుకు పడిన సమయంలో చనిపోయిన మనుషులు, జరిగిన ఆస్తి నష్టం గురించి విన్న, చూసిన సీఎం మోహన్ చరణ్ మాఝి ఈసారి తుపానుకు ఆ అవకాశం ఇవ్వకూడదని అనుకున్నారు. విపత్తు ప్రభావం ఎంత ఉన్నప్పటికీ తేలిగ్గా తీసుకోవడం సరికాదని నిర్ణయించి ఆయన గురువారం రాత్రంతా లోక్‌సేవాభవన్ మకాం వేశారు. అధికారులకు సూచనలు ఇస్తూ, నిరంతర పర్యవేక్షణ చేస్తూ గడిపారు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం నివారించడంలో విజయవంతమయ్యారు.

పరుగులు తీయించారు

తీవ్ర తుపానుగా రూపాంతరం చెందిన దానా ప్రభావం క్రమేపీ తగ్గిపోయిన్నట్లు ఐఎండీ గురువారం గుర్తించింది. ప్రభుత్వానికి సూచప్రాయంగా తెలియజేసింది. అయినప్పటికీ ముఖ్యమంత్రి మోహన్ భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో ఉండిపోయారు. యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. బాధితులకు ఆహార పొట్లాల పంపిణీకి సంబంధించి భువనేశ్వర్ రెడ్‌క్రాస్ భవన్‌లో గురువారం రాత్రి ప్యాకింగ్ జరిగింది. ఇదంతా సీఎం పర్యవేక్షణలోనే జరగడం గమనార్హం. రెండు కిలోల అటుకులు, కిలో ఛటువా, పంచదార, బిస్కెట్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, నీళ్ల సీసాలను గురువారం రాత్రే భద్రక్, కేంద్రపడ, బాలేశ్వర్ జిల్లాలకు పంపించారు.

మంత్రులు, అధికారులపై ప్రశంసలు

శుక్రవారం ఉదయం లోక్‌సేవాభవన్‌లో రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్‌పూజారి, ప్రభుత్వప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తుపాను తీవ్రత, జరిగిన నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రాణహాని జరగలేదని, ఆస్తి నష్టం పాక్షికంగా ఉందని తెలియడంతో మంత్రులను, అధికారులను అభినందించారు.



శుక్రవారం ఉదయం లోక్‌సేవాభవన్‌లో అధికారులతో సమీక్ష



గోపాల్‌పూర్ పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న మంత్రి బిభూతి

రంగంలోకి మంత్రులు

ముఖ్యమంత్రి సూచనలతో మంత్రివర్గ సహచరులు క్షేత్రస్థాయిలో అధికారులతో సహా పర్యటించారు. తొమ్మిది జిల్లాలకు నియమితులైన మంత్రులు, అధికారులతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

- మంత్రి బిభూతిభూషణ్ జెనాకు గంజాం జిల్లా పర్యవేక్షక బాధ్యతలు చేపట్టారు. ఆయన గురువారం ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు గోపాల్‌పూర్, మరో 25 తీర గ్రామాలు పర్యటించారు. మత్స్యకారులను అప్రమత్తం చేశారు. వేటకు వెళ్లొద్దని సూచించారు.

శభాష్ శివానీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: విపత్తు విరుచుపడుతుందని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ అయ్యాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న వారిని సంరక్షణ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఆశా కార్యకర్తలు సహకరించాలని ఆదేశించడంతో వారంతా బాధితులకు అండగా నిలిచారు. కానీ శివానీ మండల్ సహాయం చేయడంలో అందరి కంటే ఒకడుగు ముందే ఉంది.



వృద్ధురాలిని భుజాలపై పునరావాస కేంద్రానికి తీసుకెళుతున్న శివానీ

మానవత్వానికి ప్రతీక

కేంద్రపడ జిల్లా రాజానగర్ సమితి ఖసాముండ గ్రామానికి చెందిన శివానీ ఎంతోమందిని పునరావాస కేంద్రానికి చేర్పించింది. ఈ క్రమంలో నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాల్ని తన భుజాలపై మోసుకెళ్లింది. ఈ దృశ్యం శుక్రవారం వార్తా పత్రికల్లో ప్రచురితమైంది. వీటిని చూసిన సీఎం మోహన్‌చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడ, ఆరోగ్యశాఖ మంత్రి, ముఖేష్ మహాలింగ 'ఎక్స్' వేదికగా శివానీపై ప్రశంసలు కురిపించారు. విధి నిర్వహణలో మానవత్వాన్ని చూపిందని కొనియాడారు. విషయం తెలుసుకున్న ఆమె ఆనందం వ్యక్తం చేసింది. 2006 నుంచి తాను ఆశా కార్యకర్తగా సేవలందిస్తున్నానని గ్రామం నుంచి పునరావాస కేంద్రానికి కిలోమీటరు దూరమని 200 మందిని కేంద్రానికి చేర్చానని, 16 మంది వృద్ధులను భుజాలపై మోసుకెళ్లినట్లు తెలిపింది.

శరవేగంగా రహదారుల పునరుద్ధరణ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రపడ, భద్రక్, బాలేశ్వర్ జిల్లాల్లో పాక్షిక నష్టం జరిగింది. జగత్సింగ్‌పూర్, కేంఝర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో స్వల్పంగా ప్రభావం కనిపించింది.

- భితర్‌కనికా, ధమ్రాల మధ్య తీరం దాటిన సమయంలో పెనుగాలులు వీచాయి.
- రాజ్‌నగర్‌లోని తలచువా, భద్రక్ జిల్లాలోని ధమ్రా, బాలేశ్వర్ జిల్లాలోని చాందిపూర్ తీర ప్రాంతాల్లో అలలు ఉవ్వెత్తున ఎగసి పడ్డాయి.
- తలచువా గ్రామంలోకి సముద్రపు నీరు ప్రవేశించగా భద్రక్, కేంద్రపడ, బాలేశ్వర్ జిల్లాల్లోని ధమ్రా, బాసుదేవపూర్, రాజ్‌కనికా, రాజ్‌నగర్, మహాకాళీపడ, పట్టాముండై, బాసుదేవపూర్, చాందిపూర్, జలేశ్వర్, సతభయ సమితుల్లోని వృక్షాలు నేలకూలాయి. విద్యుత్తు తీగలు తెగి పడ్డాయి. వరి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.
- ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ఓడ్రాఫ్ బృందాలు శుక్రవారం ఉదయం నుంచి సహాయక చర్యలు ప్రారంభించాయి. మధ్యాహ్నానికి రహదారులు పునరుద్ధరించారు.



బ్రహ్మపుర నగరం: భద్రక్ జిల్లా బాసుదేవపూర్-పడవువాన్ మార్గంలో కూలిన చెట్లను తొలగిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్, ఆపద మిత్ర సిబ్బంది

ఉదయం ఇళ్లకు వెళ్లిపోయిన బాధితులు

యంత్రాంగం తొలుత 15 నుంచి 18 లక్షల మంది కోసం 7285 పునరావాస కేంద్రాలు ప్రారంభించింది. తుపాను తీవ్రత అంతగా ఉండదని ఐఎండీ పేర్కొన్న తరువాత గురువారం మధ్యాహ్నానికి 3.62 లక్షల మందిని, సాయంత్రానికి మరో 2 లక్షల మందిని తరలించారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు గాలుల తీవ్రత తగ్గిన తరువాత సగం మంది ఇళ్లకు వెళ్లిపోయారు. మూగజీవుల పశుగ్రాసానికి కొరత రానీయలేదు. చికిత్స కోసం సంచార వైద్య బృందాలనూ నియమించారు.

అందరికీ సాయం చేస్తాం: మంత్రి పూజారి

వాతావరణం పూర్తి అదుపులోకి వచ్చిన అనంతరం శనివారం ప్రభావిత ప్రాంతాల్లో విహంగ వీక్షణం(ఏరియల్ సర్వే) చేస్తామని రెవెన్యూ, విపత్తుల నివారణశాఖల మంత్రి సురేష్ పూజారి తెలిపారు. ఆదివారం నుంచి అధికారులు నష్టాలను అంచనా వేస్తారని వెల్లడించారు. పంట నష్టపోయిన, ఇళ్లు ధ్వంసమైన కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు. కేంద్రపడ, భద్రక్ జిల్లాల్లో పంట, ఇతర నష్టాలు అధికంగా ఉండవచ్చన్న అంచనా ఉందన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం అందజేస్తున్నట్లు చెప్పారు.



భద్రక్ జిల్లా ధమ్రాలోని పునరావాస కేంద్రంలోని బాధితులకు శుక్రవారం ఆహారం పంపిణీ

కొన్ని మార్గాల్లో రైళ్ల సేవలు పునఃప్రారంభం

రాయగడ పట్టణం, బ్రహ్మపుర నగరం న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొన్ని మార్గాల్లో రైళ్లసేవలను తూర్పుకోస్తా రైల్వే పునః ప్రారంభించింది. ముందుగా రద్దయిన రైళ్ల మినహా మిగతా రైళ్ల రాకపోకలు శుక్రవారం నుంచి కొనసాగిస్తున్నట్లు జోన్‌వర్గాలు వెల్లడించాయి. విశాఖపట్నం మీదుగా భువనేశ్వర్, హావ్‌డా వైపు వెళ్లే రైళ్లు వాటి సమయాల ప్రకారం నడవనున్నట్లు పేర్కొన్నాయి. ఖరగ్‌పూర్ మీదుగా విశాఖపట్నం వెళ్లే యూపీ రైళ్లు శుక్రవారం మధ్యాహ్నానికి భద్రక్ స్టేషన్ చేరుకుంటాయని రైల్వేవర్గాలు తెలిపాయి. ఇంతకుముందు రద్దుచేసిన వాటి మినహా మిగతా రైళ్లు భువనేశ్వర్ నుంచి పూరీకి యధావిధిగా కొనసాగనున్నాయి. దానా తుపాను నేపథ్యంలో రాష్ట్రం మీదుగా రాకపోకలు సాగించే 203 రైళ్లను రైల్వే రద్దు చేసిన విషయం తెలిసిందే.



బ్రహ్మపుర: శుక్రవారం మధ్యాహ్నం భువనేశ్వర్‌వైపు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్

- రాష్ట్రంలోని ప్రధాన స్టేషన్లలో ఒకటైన బ్రహ్మపుర మీదుగా ఉదయం సికింద్రాబాద్-హావ్‌డా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, మధ్యాహ్నం విశాఖ ఎక్స్‌ప్రెస్‌లు వెళ్లినట్లు స్టేషన్ అధికారులు 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ప్రయాణికులకు సమాచారం అందించేందుకు ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.



రోబోతో శశాంక శేఖర్ మహాపాత్ర్



వ్యర్థాలతో తయారు చేసిన జగన్నాథుడు, ఐరన్ మ్యాన్ ఆకృతులు

వ్యర్థాలతో రోబో.. ఐరన్‌మ్యాన్

కొత్త రూపమిస్తున్న ఐటీఐ యువకుడు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: వ్యర్థాలకు ఐటీఐ యువకుడు సరికొత్త అర్థాన్ని ఇస్తున్నాడు. అందమైన కళాకృతులు తీర్చిదిద్ది శభాష్ అనిపించుకుంటున్నాడు. బ్రహ్మపుర శివారున అంబపువా మెయిన్ రోడ్డులో నివసిస్తున్న శశాంక శేఖర్ మహాపాత్ర్ (18) బ్రహ్మపురలోని ప్రభుత్వ ఐటీఐలో ఇటీవల రెండేళ్ల ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో శిక్షణ పూర్తి చేశాడు. ఐటీఐలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో జాజ్‌పూర్‌లోని జిందాల్ స్టెయిన్‌లెస్ పరిశ్రమలో ఉద్యోగం కూడా సాధించాడు. శిక్షణ సమయంలో ఇంట్లో వివిధ రకాల వ్యర్థాలతో మహాపాత్ర్ కళాకృతులు తీర్చిదిద్ది, వాటిని ఇంట్లో అలంకరించాడు. పలువురు వాటిని తిలకించి అతడిని అభినందిస్తున్నారు. పాత ఖాళీ ప్లాస్టిక్ నీటి సీసాలతో రోబో, డోరెమాన్, ఐరన్ మ్యాన్ వంటి ఆకృతులు రూపొందించినట్లు మహాపాత్ర్ శుక్రవారం 'న్యూస్‌టుడే'కు చెప్పాడు. వినియోగంలో లేని పాత నీటి శుద్ధి యంత్రానికి అదనపు హంగులు అమర్చి జగన్నాథుడి ఆకృతి, ఐస్‌క్రీమ్ పుల్లలు, సైకిల్ చెయిన్‌లు ఇతర వ్యర్థాలతో గిటార్, పూల కుండీలు, గడియారాలు చేసినట్లు పేర్కొన్నాడు.

వైవాహిక పంజరంలో బాల్యం

- చదువుకునే వయసులో పెళ్లిళ్లు
- గర్భందాల్చి అనారోగ్యం బారిన పడుతున్న బాలికలు



నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగ్‌పూర్ జిల్లాలో బాలికల బాల్యం పంజరంలో చిక్కుకుంది. అవగాహన లేమితో వివాహ వయసు రాకముందే బాలికలకు పెళ్లి చేసేయడంతో గర్భం దాల్చిన క్రమంలో అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. 2024 ఏప్రిల్ నుంచి ఇంత వరకు 18 ఏళ్ల లోపు బాలికలు 1009 మంది గర్భం దాల్చారని ఆరోగ్య శాఖ వివరాలు వెల్లడించింది. జిల్లాలో బాల్య వివాహాలలో అధికంగా కొసగుముడా సమితిలో జరుగుతున్నాయని వెల్లడించింది.

రక్తపోటు.. పోషకాహార లోపం

చిన్న వయసులోనే గర్భం దాల్చడంతో రక్తపోటు, స్థూలకాయం, పోషకాహార లోపం, తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. అంతేకాకుండా తక్కువ బరువు కలిగిన శిశువులకు జన్మనివ్వడంతో పసికందుకు ఎదుగుదల లేకపోవడంతోపాటు తల్లిపాలు దొరకడం లేదు.

సమన్వయ లోపం

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలో బాల్య వివాహాల రేటు 20.5 శాతం, దేశంలో 23.5 శాతం ఉండగా, నవరంగపూర్ జిల్లాలో 39.4గా ఉంది. ఆరు నెలల్లో గణంకాల ప్రకారం.. జిల్లాలో 198 పంచాయతీల్లో మొత్తం 13,773 మంది మహిళలు గర్భం దాల్చగా అందులో 1009 మంది బాలికలు ఉన్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. సమితుల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. కొసగుముడాలో 171, నవరంగపూర్ 122, పపదహండి 119, జోరిగావ్ 116, రాయ్‌ఘర్ 113, ఉమ్మర్‌కోట్ 134, టెంటులిఖుంటి 66, నందహండి 69, డాబుగావ్ 71, చందహండి 28 మంది బాలికలు గర్భం దాల్చారు. ఆరోగ్య, మహిళా శిశు సురక్ష శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో బాల్య వివాహాలు పెరుగుతున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

274 వివాహాలు అడ్డుకున్నాం

జిల్లాలో ఆరునెలల్లో దాదాపు 274 బాల్య వివాహాలను అడ్డుకున్నాం. వివిధ పంచాయతీల్లో బాల్య వివాహాల నివారణకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం. మారుమూల గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– సురేష్‌పట్నాయక్, జిల్లా శిశు సంక్షేమ అధికారి

వారం రోజుల్లోగా నివేదికలు సమర్పించాలి



భువనేశ్వర్, న్యూస్‌టుడే: తుపాను మూలంగా ప్రభావిత జిల్లాల్లో ఏ మేరకు నష్టాలు జరిగాయన్న దానిపై అంచనా వేయించి వారం రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ దేవ్‌రంజన్‌కుమార్ సింగ్ శుక్రవారం ఆయా జిల్లాల పాలనాధికారులను ఆదేశించారు.

నేడు, రేపు సెలవులు రద్దు

తుపాను ప్రభావిత జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు, ఇతర సిబ్బంది సెలవులు రద్దు చేస్తున్నట్లు శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అరవింద పాఢి శుక్రవారం జారీ చేసిన ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో ఎవరూ సెలవులు తీసుకోవద్దని, క్షేత్రస్థాయిలో పంట నష్టం అధ్యయనం చేసి వారం రోజుల్లోగా నివేదికలు సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

బలోపేతం దిశగా బిజద అడుగులు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లాలో ఈ నెల 27వ తేదీ నుంచి బిసంకటక్, గుణుపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్ర చేసి ప్రజలకు చేరువ అయ్యేందుకు బిజద సన్నాహాలు చేస్తోంది. బిసంకటక్‌లో 27న, గుణపురంలో 29న పాదయాత్ర చేయనున్నట్లు జిల్లా బిజద నాయకులు సుధీర్ దాస్ తెలిపారు.



సుధీర్ దాస్



అశ్విని గమాంగ్

పూర్వవైభవానికి కృషి

సాధారణ ఎన్నికల్లో రాయగడ జిల్లాలో గుణుపురం, రాయగడ, బిసంకటక్ అసెంబ్లీ నియోజకర్గాల్లో బిజద ఓటమి చెందింది. ఈ పరాజయంతో బిజదకు ఎదురు దెబ్బ తగిలింది. తిరిగి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్నికలు జరిగిన నాలుగు నెలల తర్వాత ప్రజలు ముందుకు వచ్చేందుకు బిజద సమీకరణలు మొదలు పెట్టింది. నాయకులు సుధీర్‌దాస్, అశ్విని గమాంగ్ నేతృత్వంలో గ్రామాల్లో పాదయాత్రతో పాటు జనసంపర్క యాత్రలు నిర్వహించనున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వీటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాని ఇటీవల జరిగిన నాయకులు, కార్యకర్తలు సమావేశంలో నిర్ణయించుకున్నారు.

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా బలిగుడ ఠాణా పరిధిలోని బుడనెయి రిజర్వు అడవుల్లో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఓ మావోయిస్టు హతమయ్యాడు. అతడి వద్ద ఉన్న ఏకే 47 రైఫిల్‌ను ఎస్ఓజీ జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం ఎస్ఓజీ బృందం గాలింపులు చేపట్టగా మావోయిస్టులు ఎదురయ్యారు. ఇరువైపులా కాసేపు కాల్పులు జరిగాయి. మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకున్నారు. అనంతరం పరిశీలించగా మావోయిస్టు మృతదేహం కనిపించింది. గాలింపులు కొనసాగుతాయని జవాన్లు తెలిపారు.

ప్రమాదం అల్లుకుంది



జిల్లాలో విద్యుత్ సరఫరా నిలిపివేసే పనులు చేస్తున్నప్పటికీ పలుచోట్ల స్తంభాలకు తీగలు అల్లుకుంటున్నాయి. వీటితో ప్రమాదం జరిగే సంఘటనలు కనిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం. పర్లాఖెముండి, కాశీనగర్ ముఖ్య రహదారి గుమ్మ గెడ్డ ప్రాంతంలో ఈ దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. దీనిపై విద్యుత్ కార్యనిర్వహణ ఇంజినీర్ రాజేంద్ర బెహరాను న్యూస్‌టుడే సంప్రదించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి లతలు తొలగిస్తామన్నారు. -న్యూస్‌టుడే, పర్లాఖెముండి

నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఫ్రాన్స్‌లో లియాన్‌లోని సెప్టెంబరులో జరిగిన 47వ ప్రపంచ నైపుణ్య పోటీల్లో గజపతి జిల్లా గుసాని సమితి తంపర కవిటి గ్రామానికి చెందిన గేదెల అభిల్ సత్తాచాటారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి గత కొద్ది రోజుల క్రితం నగదు పురస్కారం అందజేశారు. గురువారం స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దిల్లీలోని అశోక్ హోటల్లో కార్యక్రమం నిర్వహించి అభిల్‌కు రూ. 2 లక్షల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రి జయంతి చౌదరి, ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి కార్యదర్శి అతుల్‌కుమార్ తివారీ తదితరులు పాల్గొన్నారు. 2026 చైనాలో జరగనున్న నైపుణ్య పోటీలకు తమ సహకారం అందజేస్తామని అన్నారు.



నగదు ప్రోత్సాహంతో గేదెల అభిల్

మద్యం తాగి నడిపితే కఠిన చర్యలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్ అన్నారు. ఈ మేరకు పాలనాధికారి కార్యాలయంలో భద్రత కమిటీ సమావేశం నిర్వహించి అధికారులతో మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి, మద్యం తాగి వాహనం నడిపినా.. శిరస్త్రాణం ధరించకపోయినా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతంలో సూచిక బోర్డులు పెట్టాలన్నారు. ఎస్పీ జె.కె.పండా, రవాణా శాఖ అధికారి ప్రసన్నకుమార్‌దాస్, ఎస్‌డీపీఓ మాధవనందనాయక్, జిల్లా ముఖ్య వైద్యాధికారి ఎం.ఎం.ఆలీ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్, పక్కన ఎస్పీ జె.కె.పండా

ప్రతిభ చాటాలి.. గుర్తింపు తెచ్చుకోవాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదివాసీ విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభను బయట ప్రపంచానికి చాటి చెప్పి గుర్తింపు తెచ్చుకోవాలని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత అన్నారు. శుక్రవారం దశమంతపూర్‌లో సమితి స్థాయి సురభి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల కోసం ఈ పోటీలు నిర్వహించామన్నారు. సమితి అభివృద్ధి అధికారి గురేశ్వర్ బోయి, ఎంపీ ప్రతినిధి కైలాష్ తదితరులు ఉన్నారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. వీరిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పవిత్ర

అనుమానాస్పదంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మృతి

జయపురం, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మృతి చెందిన ఘటన జయపురంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే కలహండి జిల్లా భవానీపట్న మదనమోహనపడ సాహికి చెందిన రాకేష్‌కుమార్ సైన్యం(49) స్థానిక పోస్టాఫీసులో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన భవానీపట్నలో నివాసముంటున్నారు. గురువారం సాయంత్రం కుటుంబీకులు రాకేష్‌కు ఫోన్‌చేయగా ఆయన స్పందించ లేదు. వెంటనే యజమానిని సంప్రదించగా అపస్మారకస్థితిలో ఉన్న ఆయనను చూసి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆసుపత్రిలో చేర్పించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. శవపరీక్ష చేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతికి గల కారణాలు తెలియదని, నివేదిక వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఐఐసీ ఈశ్వర్‌చంద్ర తెలిపారు.

గిరిజనుడి గల్లంతు

మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: చేపలు పట్టడానికి వెళ్లి ఓ గిరిజనుడు గల్లంతైన ఘటన గురువారం మాచ్‌ఖండ్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఒనకడిల్లీ పంచాయతీ కుడుంగుడ చెందిన శుక్రు లోరి (53) గురువారం సాయంత్రం మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం దిగువన నదిలో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఇంతలో ఓ భారీ చేప వలలో పడింది. వలను లాగుతుండగా నదిలో జారి పడ్డారు. గల్లంతైన వ్యక్తితో వచ్చిన వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ చీకటి పడడంతో వెనుతిరిగారు. శుక్రవారం తెల్లవారి నుంచి మాచ్‌ఖండ్ పోలీసులు, అమతపుట్ అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపడుతున్నారు.



ఘటన స్థలం వద్ద అగ్నిమాపక సిబ్బంది

దాడి ఘటనలో నలుగురి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా గొళంత్రా ఠాణా పరిధిలో రంగిపూర్ గ్రామంలోని ఇటుకల బట్టీ సమీపంలో ఈనెల 11న అదే గ్రామానికి చెందిన సుశాంత నాహక్ (30) అనే యువకుడిపై కొందరు కర్రలు, మారణాయుధాలతో దాడి చేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడ్డ నాహక్‌ను కుటుంబ సభ్యులు చికిత్సకు ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి భార్య ఇచ్చిన మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నలుగురు నిందితులను గాలించి పట్టుకున్నారు. శుక్రవారం న్యాయస్థానానికి తరలించినట్లు బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ తెలిపారు.

చోరీ కేసులో మరో నలుగురు..

జయపురం, న్యూస్‌టుడే: చోరీ కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌డీపీఓ అంకిత్‌వర్మ శుక్రవారం మీడియా సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శనగర్ వీవీప్లైనకు చెందిన బాలకృష్ణ అధికారి ఈ నెల 14వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి జగదల్‌పూర్ వెళ్లారు. ఇదే గమనించిన దుండగులు ఆ రోజు రాత్రి ఇంట్లో చొరబడి 40 తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలు, రూ. 2 లక్షల నగదు దోచుకున్నారు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న యజమాని 15వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి గురువారం రాత్రి దుండగులను అరెస్టు చేశారు. నిందితులు పి.ఆర్.పేటకు చెందిన కె.సుమన్, సునాసాహికి చెందిన రాజునాయక్, బెలోర్పు ప్రాంతానికి చెందిన ఎస్.వెంకటేష్, చందబాద్ సాహి నుంచి ఎం.శివగా గుర్తించారు. వారి దగ్గర నుంచి 54.830 గ్రాముల బంగారం బిస్కెట్, ఒక బంగారు ఉంగరం, కొన్ని వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. జామీను మంజూరు కాకపోవడంతో వీరిని జైలుకు పంపించారు.

895 లీటర్ల నాటు సారా స్వాధీనం

రాయగడ పట్టణం, రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: అబ్కారీ శాఖ జరిపిన దాడుల్లో 895 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అబ్కారీ శాఖ మీడియాకు ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. రాయగడ, కెసింగ్‌పూర్, కాశీపూర్ స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన అబ్కారీ దాడుల్లో 895 లీటర్ల నాటు సారా, 8,150 లీటర్ల ఊట నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేయగా, నిందితుల్లో ఓ మహిళతో పాటు ఏడుగురు పురుషులు ఉన్నారు.

మూడు బట్టీలు ధ్వంసం

జయపురం, న్యూస్‌టుడే: జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్, జయపురం అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పాత్రపుట్ పంచాయతీ బెడగూడ గ్రామంలో సారా బట్టీలపై దాడులు జరిగాయి. అబ్కారీ ఇన్‌స్పెక్టర్ శశికాంత్‌దత్ నేతృత్వంలో ఈ సోదాలు జరిగాయి. మూడు బట్టీలు, 190 లీటర్ల నాటు సారా, 1900 లీటర్ల విప్పసారా ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుంటామని అన్నారు.

అంతరవర్సిటీ బ్యాడ్మింటన్ విజేత కిట్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీవరకు జరిగిన తూర్పు జోన్ అంతర్‌వర్సిటీ మహిళా బ్యాడ్మింటన్ పోటీల్లో కిట్ విశ్వవిద్యాలయం విజేతగా నిలిచింది. బుర్లాలోని బిజు పట్నాయక్ ఇండోర్ మైదానంలో గురువారం జరిగిన సింగిల్స్ తుదిపోరులో కిట్స్‌కు చెందిన హర్షిత రౌత్ 21-16, 14-21, 21-16 సెట్లతో ఆడమ్స్ వర్సిటీకి చెందిన గౌరీకృష్ణపై గెలుపొందింది. అలాగే డబుల్స్ తుదిపోరులో హర్షిత, శృతిస్వయిన్ జోడి 24-22, 5-2 సెట్లతో గౌరీ, రసికా దాస్‌లపై విజయం సాధించారు.



ట్రోఫీతో శృతిస్వయిన్, హర్షిత రౌత్

అనికేత్‌దే టైటిల్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: కటక్‌లోని బారబటి క్రీడామైదానం టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఈ నెల 21 నుంచి 25వ తేదీవరకు జరిగిన జాతీయ టెన్నిస్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు అనికేత్ సాహు, సూర్యాస్ పట్నాయక్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఆలిండియా టెన్నిస్ సంఘం (ఐటా), కటక్ జిల్లా టెన్నిస్ సంఘం (సీడీటీఏ)ల తరపున జరిగిన తుదిపోరులో అనికేత్ 6-3, 7-5 పాయింట్లతో సూర్యాస్‌పై గెలుపొంది ఈ ఘనత సాధించాడు.



బహుమతులతో అనికేత్, సూర్యాస్‌లు

రక్షణశాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా సప్తగిరి

రాయగడ, న్యూస్‌టుడే: కొరాపుట్ పార్లమెంటు సభ్యుడు సప్తగిరి ఉలక రక్షణశాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. శుక్రవారం ఆయన విలేకర్లకు విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. పార్లమెంటు వ్యవహారాలు శాఖ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అధ్యక్షుడిగా ఏర్పాటైన ఈ కమిటీలో 14 మంది పార్లమెంటు, 6గురు రాజ్యసభ్యులతో పాటు మరో ఇద్దరు ఇతర సభ్యులు ఉన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ పండా, స్థానిక శాసనసభ్యుడు అప్పలస్వామి కడ్రక, కాంగ్రెస్ కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



సప్తగిరి ఉలక

గోశాల నిర్మాణానికి శంకుస్థాపన

నవరంగపూర్, న్యూస్‌టుడే: జయపురం పట్టణం బాలియా పంచాయతీ సున్నానగర్‌లో బుధవారం గోశాల నిర్మాణానికి శాసనసభ్యుడు తారా ప్రసాద్ బాహినిపతి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. 2.9 ఎకరాల్లో రూ.2 కోట్ల 48 లక్షలు వెచ్చించి దీన్ని నిర్మించనున్నారు. ఇక్కడ 100 గోవులను సురక్షితంగా ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో సిద్ధార్థ్ పట్నాయక్ తెలిపారు. పురాధ్యక్షుడు నరేంద్ర మొహంతి, ఉపాధ్యక్షురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ అవాస్తవం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఎమ్కేసీజీ వైద్య కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థులపై ర్యాగింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. శుక్రవారం సాయంత్రం ఎమ్కేసీజీ డీన్, సిబ్బంది యాంటీ ర్యాగింగ్ సెల్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బాధిత విద్యార్థులు, సీనియరు విద్యార్థులతో మాట్లాడి, దేహాన్ని పరిశీలించారు. గాయాలు ఏమీ లేకపోవడంతో ర్యాగింగ్ జరగలేదని సమావేశానంతరం డీన్ దాస్ విలేకరులకు తెలిపారు.

అవినీతి నిర్మూలన వారోత్సవాలపై సన్నాహక సమావేశం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పాలనాధికారి బిజయ్‌కుమార్ దాస్ అధ్యక్షతన శుక్రవారం పాలనాధికారి కార్యాలయంలో అవినీతి నిర్మూలన వారోత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బ్రహ్మపుర విజిలెన్స్ ఎస్పీ గణేష్‌చంద్ర ప్రధాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ వారోత్సవాలను జిల్లాలోని ఏడు సమితుల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి నవంబరు 3వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. అదనపు పాలనాధికారి రాజేంద్రమింజ్, డీఎస్పీ బి.వాసుదేవరావు, జడ్పీ కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్‌లతో వివిధ సమితి అధికారులు వర్చువల్ మాధ్యమంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్, పక్కన బ్రహ్మపుర విజిలెన్స్ ఎస్పీ గణేష్‌చంద్ర ప్రధాన్

విద్యార్థిని మృతికి కారణాలేంటి..?

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా చందహండి సమితి పానబెడ, జూనియర్ కళాశాల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కలహండి జిల్లా కోకసారా సమితి మాఝిగూడ గ్రామానికి చెందిన భైశాలి చలాన్(16) స్థానిక కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతోంది. ఆమె ముగ్గురు స్నేహితురాళ్లతో కలసి ఒక ఇంట్లో అద్దెకు ఉంటూ చదువుకుంటోంది. ఆమె గురువారం రాత్రి స్నేహితులతో కలసి భోజనం చేసి నిద్రించారు. ఉదయం భైశాలి నిద్ర నుంచి లేకపోవడంతో స్నేహితురాళ్లు స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందిందని తెలిపారు. శవపరీక్ష అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. పరీక్ష నివేదిక అనంతరం మృతికి గల కారణాలు తెలియజేస్తామన్నారు. రెడ్‌క్రాస్ నిధి నుంచి మృతురాలి కుటుంబానికి రూ.10 వేలు యంత్రాంగం అందజేసింది.

ప్రధానోపాధ్యాయుడిపై వేటు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ కొల్నార సమితి బోయిమడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంతకుమార్ పలకపై వేటు పడింది. పాఠశాలలో సక్రమంగా విధుల నిర్వర్తించనందుకు ఆయనను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.బసంతకుమార్ నాయక్ తెలిపారు. రాయగడ బ్రాహ్మణవీధి ప్రాథమిక పాఠశాలకు చెందిన సుభాష్‌చంద్ర పలక పనివేళల్లో తరగతి గదిలో చరవాణి వినియోగించడంతో ఒకరోజు జీతం నిలిపివేశారు. శ్రీ ముఖాలు జారీ చేశారు. దీనిపై మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని డీఈఓ ఆదేశించారు. పాలనాధికారి పరుల్‌పట్వారీ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారి బసంతకుమార్ నాయక్ జిల్లాలో అన్ని పాఠశాలల్లో తనిఖీలు చేశారు.

మోసం కేసులో ఒకరి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర సదర్ ఠాణా పరిధిలోని గౌతమి గ్రామానికి చెందిన ఎస్.ఉల్లును మోసం కేసులో పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించారు. టికినా బెహరా అనే యువకుడికి ఓ స్థలం విక్రయిస్తామని రూ. 17 లక్షలు తీసుకున్నారు. స్థలం విక్రయించకపోగా, సొమ్ము తిరిగి చెల్లించలేదు. బాధితుడు ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

యజమానుల సంఘం సభ్యులకు సత్కారం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ లారీ యజమానులు సంఘం ఎన్నికలు మంగళవారం ముగిసిన విషయం తెలిసిందే. కొత్త కార్యవర్గం సభ్యులను సునాబెడ పురపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. పురాధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్రో నూతన అధ్యక్షుడు సునీల్ అగర్వాల్, ఇతర కార్యవర్గ సభ్యులను అభినందించారు.



అధ్యక్షులు సునీల్‌ను అభినందిస్తున్న రాజేంద్ర

అన్యాయం చెయొద్దు.. ఆదుకోండి

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో 108, 102 అంబులెన్స్ చోదకులు, సహాయకులు, ఫార్మసిస్టులకు విధులు నిర్వర్తించాలంటే ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే...2013 నుంచి జిల్లాలో 108 అంబులెన్స్ సేవలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో 230 మంది విధులు నిర్వహిస్తున్నారు. 2013 నుంచి 2024 అక్టోబరు 20 వరకు జిగిచ హెల్త్ కేర్, ముంబయి అంబులెన్స్ బాధ్యతలు తీసుకున్నారు.. ఈ గడువు ముగియడంతో కొత్తగా రాష్ట్రస్థాయిలో బాధ్యతలు చేపట్టిన కంపెనీ ఏడాది ఒప్పందంతో కూడిన నియమాక పత్రాన్ని 26వ తేదీన సిబ్బందికి ఆన్‌లైన్‌లో పంపించారు. ఇందులో జీతాలకు సంబంధించి ఎక్కడ ప్రస్తావించకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. ఈ మేరకు జిల్లా అంబులెన్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్ టంగుల్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా కార్మికశాఖాధికారి బృందావన్‌సెఠిని కలిసి వినతిపత్రం అందజేశారు.



కార్మికశాఖ కార్యాలయం ఎదుట సిబ్బంది

184 ప్రమాదాల్లో 128 మంది మృతి

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో గత 9 నెలలుగా జరిగిన 184 ప్రమాదాల్లో దాదాపు 128 మంది మృతిచెందారు. అలాగే 2023లో జరిగిన 207 ప్రమాదాల్లో 136 మంది మరణించినట్లు ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రహదారి సురక్ష కమిటీ సమావేశంలో ఏఎస్పీ బటకృష్ణమిశ్ర తెలిపారు. పోలీసులు, ఆర్‌టీఓలు ఉమ్మడిగా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ప్రాంతీయ రవాణాధికారి జితేంద్రకుమార్‌భోయ్ ఆదేశించారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు వాహన యజమాని నుంచి జరిమాన వసూలు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యుల ద్వారా పంచాయతీల్లో, గ్రామాల్లో చైతన్య పరచాలన్నారు. పురపాలక అధికారులు, రహదారి భద్రతాధికారులు, గ్రామాభివృద్ధి సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

హమ్మయ్యా.. తృప్తిగా భోజనం చేశాం...!


జయపురం, న్యూస్‌టుడే: జమపురం సమితి వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తృప్తిగా వేడి అన్నం తిన్నారు. ఏడాది క్రితం సమితిలో వివిధ పాఠశాలకు మధ్యాహ్న భోజనం బాధ్యతలు కొరాపుట్‌లోని కేంద్ర కిచెన్‌కి అప్పగించారు. ఈ కేంద్రం నుంచి ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల తేలిన పప్పు, రుచి పచి లేని కూరలు సరఫరా జరిగేవి. ఈ ఆహారాన్ని తినేందుకు విద్యార్థులు ఇష్టపడక ఇళ్లకు వెళ్లి భోజనం చేసేవారని పాఠశాల కమిటీ పురాధ్యక్షుడు నరేంద్రమహంతికి తెలిపారు. దీనిపై పలుమార్లు సమితి విద్యాశాఖాధికారి సుదీర్ చంద్రరథ్ దృష్టికి తీసుకెళ్లారు. బీఈఓ క్షేత్రస్థాయిలో వివిధ పాఠశాలల్లో భోజనాల నాణ్యత పరిశీలించి నివేదికను తయారు చేశారు. ఆ నివేదికను జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామచంద్ర వాహక్, సీడీపీఎంవో డా.అరుణ్‌కుమార్ పాఢికి రెండు నెలలు క్రితం అందజేశారు. డీఈఓ కేంద్రీయ కిచెను నిర్వాహకులను పలుమార్లు హెచ్చరించిన ఫలితం లేదు. దీంతో ఈ నెల 15వ తేదీన ఏడాది కాంట్రాక్ట్ పూర్తికాగానే సరఫరాను నిలిపివేశారు. ఆ బాధ్యతలను పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా ఎస్‌హెచ్‌జీ బృందాలకు అప్పగించారు. సమితిలో మొత్తం 186 పాఠశాలల్లో 11,873 మంది విద్యార్థులు దసరా సెలవులు తర్వాత రెండు రోజులుగా హాజరవుతుండగా, ప్రతీ రోజూ దాదాపు 11,713 మంది భోజనం చేస్తున్నట్లు తెలిపారు.



బర్నిపుట్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులు

రాగులతో ప్రయోజనాలు అధికం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా టెంటులిఖుంటి సమితి కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర మిల్లెట్స్ మిషన్ తరపున రాగులు తినడంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన రథం ప్రారంభించారు. బీడీఓ మనోజ్‌కుమార్ పాణిగ్రహి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తహసీల్దార్ రాజ్‌కిషోర్ పట్నాయక్ నేతృత్వంలో రథానికి పచ్చజెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. సీడీపీఓ బినితసెఠి, సమితి వ్యవసాయ శాఖాధికారి, మానస్‌రంజన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రథం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

బియ్యం సరఫరా అయ్యేనా..?

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా పపదహండి సమితిలో ఒక గిడ్డంగిలో సంకేతాలు అందక వేరే గిడ్డంగి రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డగించారు. స్థానిక గ్రామాలకు అందించాలని, తర్వాత వేరే ఊర్లకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సదరు సమితిలో కంటమాల పంచాయతీలో ప్రభుత్వ గిడ్డంగి లేకపోవడంతో రెండు గ్రామాల్లో పీడీఎస్ గిడ్డంగ్‌లు ఏర్పాటు చేశారు. కంటమాల వద్ద బియ్యం ఇచ్చేందుకు సంకేతాలు అందలేదు. రండాగూడ గిడ్డంగి నుంచి రేషన్ బియ్యాన్ని ట్రాక్టర్‌లో లోడు చేసి తీసుకెళ్తుండగా ఎనిమిది గ్రామాల ప్రజలు అడ్డగించారు. ఈ విషయంపై అదనపు సరఫరా అధికారి జషశ్రీ బెహరాను అడగ్గా కంటమాల్లో సంకేతాలు అందక ఆయా గ్రామాల్లో బియ్యం సరఫరా కాలేదన్నారు.



ట్రాక్టర్ వద్ద నిల్చొన్న మహిళలు

కొండ చిలువ పట్టివేత

రాయగడ, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో భారీ కొండ చిలువ ప్రవేశించడంతో వసతి గృహంలో విద్యార్థులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. సిబ్బంది పాములు పట్టిన వ్యక్తి ప్రదీప్‌కు సమాచారం అందించగా ఆయన కొండచిలువను పట్టి సమీప అడవుల్లో విడిచిపెట్టారు.



భారీ కొండచిలువను పట్టుకున్న ప్రదీప్

వీల్‌చైర్లు అందజేత

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పాలక సంస్థ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వీల్‌చైర్లు అందజేశారు. పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్రకుమార్‌పాత్రో నేతృత్వంలో కార్యనిర్వాహక అధికార నారాయణ నాయక్, కౌన్సిలర్లు శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో రోగుల సౌకర్యార్థం ఆరు వీల్‌చైర్లను అందించారు.

పరబ్ వేడుకల ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎమ్మెల్యే

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదివాసీ కళలు, సంస్కృతి పరిరక్షించే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న పరబ్-2024 వేడుకలు ఆదివారం నుంచి మొదలవుతున్నాయి. సిమిలిగుడ సమితి దుదారి సమీపంలో మౌళిమందిరం నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఏర్పాట్లను ఎమ్మెల్యే రామ్‌చంద్రకడమ్ శుక్రవారం పర్యవేక్షించారు. అధికారులు, మహిళా సంఘాల మహిళలతో మాట్లాడారు.

గుణుపురంలో ముగిసిన గజలక్ష్మీ సంబరాలు




గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడజిల్లా గుణుపురం పట్టణంలో శుక్రవారంతో గజలక్ష్మీ సంబరాలు ముగిశాయి. మండపాలు వద్ద ఏర్పాటు చేసిన దేవి ప్రతిమలను గంగమ్మ ఒడిలోకి చేర్చారు. గురువారం రాత్రి సమితి కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యాక్రమాలు అలరించాయి. గిరిజన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

అవీ.. ఇవీ.. అన్నీ

సామూహిక కుంకుమార్చనలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని మలంచా ప్రాంతంలో ఉన్న శ్రీ తిరుపతి వేంకటేశ్వర పెరుమాళ్ దేవస్థానం 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల బృందం సామూహిక కుంకుమార్చన నిర్వహించింది.

ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కును అందజేస్తున్న వైద్యురాలు ఎం.రామలక్ష్మి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని రాజావీధి ప్రాంతంలో ఉన్న జగన్నాథ మందిర నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన వైద్యురాలు ఎం.రామలక్ష్మి రూ.లక్ష చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఈదురుగాలులతో వర్షం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: 'దానా' తుపాను కారణంగా తూర్పు మిడ్నాపూర్, పశ్చిమ మిడ్నాపూర్, ఝార్‌గ్రామ్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం గురువారం రాత్రి నుంచి కురిసింది. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి ఇబ్బందులు కలిగించింది.



పురపాలక సంఘం కార్యాలయం వద్ద నిలిచిపోయిన నీరు

సుజయ్‌హజ్రా నామినేషన్ దాఖలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మిడ్నాపూర్ శాసనసభ స్థానం ఉప ఎన్నికలు నవంబరు 13న జరగనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా సుజయ్‌హజ్రా గురువారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న సుజయ్ హజ్రా

లక్ష్మీబస్సుల రవాణాపై సబ్‌కలెక్టర్‌కు వినతి

జయపురం, న్యూస్‌టుడే: జయపురం ఓఎస్‌ఆర్‌టీసీ బస్టాండులో గత 9 నెలలుగా లక్ష్మీబస్సులు మూలకు చేరాయి. జిల్లాలో వివిధ ప్రాంతాలకు వీటిని పునః ప్రారంభించాలని కోరుతూ శుక్రవారం పాలనాధికారికి పబ్లిక్ రైట్స్ అసోసియేషన్ తరపున సబ్‌కలెక్టర్ సస్యరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు దేవేంద్ర వాహినిపతి, సభ్యులు బాలారాయ్, రాజేంద్రకుమార్ గౌడ్, అరవింద్‌దొర తదితరులు ఉన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

వాగు నీరే గతి.. ఎన్నాళ్లీ దుస్థితి

సీతంపేట మన్యంలోని అనేక గిరి శిఖర, గిరిజన తండాలకు నేటికీ కొండ వాగు నీరే గతవుతోంది. అది తాగుతున్న గిరిజనులు వ్యాధుల బారినపడుతున్నారు.ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా జ్వరాలు, మలేరియాతో బాధపడుతున్నారు.

గిరి శిఖర గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు, బావులు వంటివి లేకపోవడంతో కొండవాగుల నీటిని గ్రావిటేషన్‌ఫ్లో ద్వారా గ్రామాలకు రప్పించి అందిస్తున్నారు. వేసవిలో వాగులో తక్కువ నీరు ఉంటే ఎద్దడి నెలకొంటుంది. వర్షాకాలంలో పుష్కలంగా ఉన్నా బురదమయమై కలుషిత జలం వస్తుంది. ప్రధానంగా మర్రిపాడు పంచాయతీ ఎగువద్వారబంధం, నడిమి ద్వారబంధం, దిగువద్వారబంధంలో సుమారు 80 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామాలకు ఎగువన నాలుగైదు కి.మీ. దూరంలోని కొండవాగు నుంచి పైపుల ద్వారా నీటిని అందిస్తున్నారు. అది ప్రస్తుతం కలుషితమై ఉంది. ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ సత్యం వద్ద ప్రస్తావించగా ఆయా గ్రామాల్లో సమస్యలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

– న్యూస్‌టుడే, సీతంపేట



వాగు నీటిలో ఆకులు, వ్యర్థాలు పడడంతో కలుషితం అవుతున్న దృశ్యం



పైపుల ద్వారా వస్తున్న వాగునీటిని పట్టుకుంటున్న ద్వారబంధం మహిళలు

జిల్లాకు రెండు కుంకీ ఏనుగులు



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతంలో మరణాలు పునరావృతం కాకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో ప్రసూన ఆదేశించారు. శుక్రవారం పార్వతీపురం, పాలకొండ రేంజర్లు రాంనరేష్, జగన్నాథం, మణికంఠేష్‌తో సమీక్షించారు. జిల్లాకు రెండు కుంకీ ఏనుగులు మంజూరయ్యాయని, వాటిని అదుపు చేసేందుకు ఇద్దరికి శిక్షణ ఇస్తామన్నారు. నవంబరులో నంద్యాలలో, తర్వాత కర్ణాటకలోని డుబ్రిలో రెండు నెలల శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం పెదబొండపల్లి ఏనుగుల దాడిలో మృతిచెందిన యాకోబు కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ఎమ్మెల్యే విజయచంద్రతో కలిసి పరిహారం అందజేస్తామన్నారు. ఏనుగుల దాడిలో ఇప్పటివరకు 12 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఏనుగులను కవ్వించొద్దని, వాటికి 200 మీటర్ల దూరంలో ఉండాలని హెచ్చరించినా జనం పట్టించుకోవడం లేదని డీఎఫ్‌వో అన్నారు.

వివాహాలకు వెళ్లినా.. పంట పొలాల్లో చూసినా.. ప్రస్తుతం డ్రోన్లే కనిపిస్తున్నాయి. సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రంగాల్లో యాంత్రీకరణ పరుగులు పెడుతోంది. వ్యవసాయంలో ఇటీవల కొత్త కొత్త పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనది డ్రోన్. విత్తనాలు చల్లడం, ఎరువులు పిచికారీ చేయడంలో రైతులకు శ్రమ తగ్గించి, ఆదాయానికి మార్గం వేస్తోంది. ప్రభుత్వం సైతం రాష్ట్రాన్ని డ్రోన్ ఇన్నోవేషన్ కేంద్రంగా మారుస్తామని చెప్పడంతో జిల్లా వ్యవసాయ అధికారులు వాటిపై ఆసక్తి చూపుతున్నారు.

వ్యవసాయంలో డ్రోన్ యుగం

★ వినియోగంతో రైతులకు మేలు

★ ప్రోత్సహిస్తున్న అధికారులు



పార్వతీపురంలో డ్రోన్‌తో పిచికారీని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ (పాత చిత్రం)

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 451 పంచాయతీలు ఉన్నాయి. 3.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నారు. జిల్లాలో చిన్న సన్నకారు రైతులే ఎక్కువ. పంటల సీజనల్లో కూలీల కొరత ఏర్పడుతుంది. వారి స్థానంలో డ్రోన్‌ను వినియోగించాలని వ్యవసాయ అధికారులు సైతం సూచిస్తున్నారు.

ధరలు.. రాయితీలు..

వ్యవసాయ రంగంలో వినియోగించే డ్రోన్ రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. బ్యాటరీ విలువ రూ.40వేలు. రెండు, మూడు బ్యాటరీలు అందుబాటులో ఉంచాలి. పొలంలో విద్యుత్తు లేకపోతే జనరేటర్ ఉండాలి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), ఎస్‌ఎంఏఎం పథకాల ద్వారా డ్రోన్‌పై 40 శాతం రాయితీ ఇస్తారు. 10 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలయితే కేంద్రం రూ.4 లక్షల రాయితీ, బ్యాంకు రూ.5 లక్షల రుణం ఇస్తాయి. 10 శాతం రైతు, స్వయం శక్తి సంఘాలు సమకూర్చాల్సి ఉంటుంది.

రోజుకు 100 ఎకరాల్లో పిచికారీ..

డ్రోన్ సామర్థ్యం బట్టి గరిష్ఠంగా 75 నుంచి 100 ఎకరాల్లో క్రిమిసంహారక మందు పిచికారీ చేయొచ్చు. మొక్క అడుగు నుంచి పైవరకు తడుస్తుంది. ఇద్దరు కూలీలను పెడితే రోజుకు రూ.500 నుంచి రూ.600 చెల్లించాలి. వారికి రూ.1,100 అవుతుంది. అదే డ్రోన్ నిర్వాహకులకు రూ.450 నుంచి రూ.550 చెల్లిస్తే చాలు. దీనికి తోడు ఎకరా భూమిలో 10 నిమిషాల్లో పిచికారీ చేయొచ్చు. స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తే ఎకరాకు 200 లీటర్ల నీరు అవసరం. డ్రోన్‌తో అయితే కేవలం 10 లీటర్లు సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

గతంలో అడుగులు పడలే..

గతంలో వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగంలో డ్రోన్లు అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. జిల్లాలో 10 మందికి పైలెట్లుగా శిక్షణ ఇచ్చింది. కానీ డ్రోన్లు సమకూర్చలేదు. సొంతంగా కొనుగోలు చేసి ఆదాయం పొందాలని సూచించడంతో ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం డ్రోన్లకు అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

ప్రభుత్వ సూచన మేరకు...

వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రైవేటు సిబ్బందితో ప్రయోగాలు చేశాం. రానున్న రోజుల్లో సేవలు విస్తరించే అవకాశాలున్నాయి. గతంలో పది మందికి శిక్షణ ఇచ్చాం. ప్రస్తుత ప్రభుత్వ సూచనలు, ఆదేశాలతో ముందుకు వెళ్తాం.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

చెరకు తోట దగ్ధం ...జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని కుందరతిరువాడకు చెందిన ఎం.పెద్దినాయుడు 2 ఎకరాల చెరకు తోట గురువారం అర్ధరాత్రి దగ్ధమైంది. గ్రామస్థులు, రైతులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



బాలికలను ప్రశ్నిస్తున్న పీవో అశుతోష్ శ్రీవాస్తవ

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ శుక్రవారం సందర్శించారు. శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'కళ్ల ముందే కొత్త భవనం.. చదువులకు తప్పని కష్టం' శీర్షికతో ప్రచురితమైన చిత్రవార్తపై స్పందించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, భోజన గది పరిశీలించారు. ప్రస్తుతం 371 మంది చదువుతున్నారని స్నానవాటికలు, మరుగుదొడ్ల సమస్య ఉందని హెచ్‌ఎం శారదాదేవి తెలియజేశారు. కొత్త భవనం ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. తహసీల్దారు రవి, ఎంపీడీవో పాత్ర్, పాఠశాల సహాయ సంరక్షకురాలు స్వర్ణలత ఉన్నారు.

పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద మాక్‌డ్రిల్

పాచిపెంట, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్రాల నుంచి వచ్చే మాదక ద్రవ్యాలు, గంజాయి, నాటుసారాను అడ్డుకట్ట వేసేందుకు పోలీసుశాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు మండలం పాచిపెంటలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద సాలూరు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అక్రమ రవాణా గుర్తింపునకు డ్రోన్, ప్రత్యేక శిక్షణ పొందిన శునకాన్ని వినియోగించి ఒడిశా నుంచి వచ్చిన వాహనాలను తనిఖీలు నిర్వహించారు. చేశారు. ఎస్సై వెంకటసురేష్, పోలీసులు పాల్గొన్నారు.

అనుమతి గోరంత.. ఆక్రమణ కొండంత..!

గ్రానైటు క్వారీల్లో నిబంధనలు బేఖాతరు

హరిపురం (మందస), న్యూస్‌టుడే

సహజ వనరులను ఇష్టానుసారం కొల్లగొడుతున్నారు. నచ్చిన చోట యథేచ్ఛగా తవ్వేసి పచ్చని కొండలను పిండి చేస్తున్నారు. అనుమతులు తీసుకున్నది గోరంతైతే తవ్వకాలు మాత్రం కొండంతా అన్నట్లు దందా సాగుతోంది. అధికారులకు తెలిసినా పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. మందస మండలంలోని పలు గ్రానైటు క్వారీల్లో అక్రమాల పర్వం సాగుతోంది. ఎక్కడా నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. అనుమతికి మించి కొండల్ని తొలిచేస్తున్నారు.



దాలకాయి సమీపంలో నల్లరాయి తవ్వకాలు

- కొండలోగాం సమీపంలో కొండకు కొంత భాగంలో క్వారీ నిర్వహించడానికి అనుమతులున్నాయి. ఇక్కడ మొత్తం ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నాయి.



రాళ్లను యంత్రం సాయంతో ముక్కలు చేస్తున్న కార్మికుడు

- టంగరపుట్టి, గంద్రుగాం, మహేంద్రపురం, బొగాబంద వద్ద రెవెన్యూ భూముల్లో అనుమతికి మించి గ్రానైటు తవ్వేస్తున్నారు.
- దాలకాయి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా బాంబులతో బండ రాళ్లను పేల్చి కొండను కొల్లగొడుతున్నారు. ఇక్కడి నుంచి పలాస మండలం తర్లాకోట, లొద్దభద్ర వద్ద స్టోన్ క్రషర్లకు తరలిస్తున్నారు. క్వారీలో పని చేస్తున్న కార్మికులకు కనీస వసతులు లేవు. గాయాలు తగలకుండా తల, కాళ్లు, చేతులకు తొడుగులు లేవు. శ్వాస తీసుకునేటప్పుడు శరీరంలోకి ధూళి వెళ్లకుండా మాస్కులు ధరించాలి. అవి లేకుండానే పనులు చేస్తున్నారు. కొందరు బాలురు కార్మికులుగా పని చేస్తున్నారని సమాచారం. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నిర్వాహకులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

భారీ వాహనాలతో ముప్పు

గ్రానైటు బండలను సానబెట్టడానికి ట్రాలీ లారీలపై తరలిస్తున్నారు. గ్రామీణ రహదారులపై 20 టన్నులకు మించి బరువుతో వాహనాలు నడపకూడదు. ఈ ప్రాంతంలో క్వారీల నుంచి 50 టన్నులకు మించి బరువుతో తరలిస్తుండటంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. కల్వర్టులు దెబ్బతింటున్నాయి. గ్రామాల్లో కొందరు అడ్డుపడిన వారికి తాయిలాలు ఎర చూపి పని సాగిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం.

అనుమతించిన మేరకే గ్రానైటు క్వారీల్లో తవ్వకాలు జరపాలి. అంతకు మించి చేపడితే అది అక్రమమే. మందస మండలంలోని అన్ని గ్రానైటు క్వారీలను సందర్శిస్తాం. అనుమతికి మించి తవ్వకాలు జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.

- విజయలక్ష్మి, గనుల శాఖ ఏడీ, టెక్కలి, హైమావతి, తహసీల్దారు, మందస

పారిశ్రామిక పార్కుకు స్థల సేకరణ

పార్వతీపురం, పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అవసరమైన స్థలం సేకరించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. పాచిపెంట జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రాంతాలను గుర్తిస్తే భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే గ్రామసభల దస్త్రాలు పక్కాగా ఉండాలని సూచించారు. జేసీ శోభిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడు, తహసీల్దారు, సర్వేయర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

అధ్యక్షా.. మేమూ సిద్ధం



గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీవరం ఆధ్వర్యంలో శుక్రవారం నమూనా పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. స్పీకర్, ప్రధానమంత్రి, అధికార, ప్రతిపక్ష నాయకులు, కావాల్సిన యంత్రాంగంతో శీతాకాల సమావేశాలు ఏర్పాటు చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలు, అధికార పార్టీ ఇచ్చే సమాధానాలు, స్పీకర్ వాకౌట్ చేసే విధానంపై విద్యార్థులు వివరించి ఆకట్టుకున్నారు. వైస్ ప్రిన్సిపల్ రామయ్య, అధ్యాపకులు శ్రీవాణి, కృష్ణ, కల్పన పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

పాల సేకరణ ధర పెంచాలని ఆందోళన

సీతానగరం, న్యూస్‌టుడే: పాల సేకరణ ధరలు పెంచాలని కోరుతూ శుక్రవారం కాశాపేట శీతలీకరణ కేంద్రం వద్ద ఉత్పత్తిదారులు ఆందోళన చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 36వ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నెల 29న విశాఖ డెయిరీని ముట్టడిస్తామన్నారు. ధర తగ్గించడంతో రైతులు ఆర్థిక నష్టాలు చవిచూస్తున్నారన్నారు. రైతు సంఘం నాయకులు లక్షుంనాయుడు, అప్పారావు, ఈశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఈ పాపం.. గత పాలకులదే!

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: గత పాలకుల ప్రణాళిక లోపంతో ప్రస్తుతం పాలకొండ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రూ.కోట్లలో నిధులు ఉన్నా సకాలంలో పనులు చేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. నగర పంచాయతీగా ఉన్న పాలకొండ పట్టణంలో ఇంటింటికీ తాగు నీరు అందించేందుకు కేంద్రం నాన్‌అమృత్ పథకంలో భాగంగా రూ.57 కోట్లు మంజూరు చేసింది. 65 కి.మీ. మేర పైపులైన్లు, 5 కి.మీ. మేర ప్రధాన పైపులైన్లు వేయాలి. కానీ మూడేళ్లలో కేవలం 5.7 కి.మీ. పనులు మాత్రమే జరిగాయి. గారమ్మకాలనీ, మురళీమోహన్‌నగర్, గాయత్రీనగర్, నవోదయనగర్, ఎన్‌ఎస్‌ఎన్ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో తాగు నీరు సక్రమంగా అందడం లేదు.

శిలాఫలకంతో సరి..

పాలకొండ పట్టణంతో పాటు మండలంలో కూరగాయల రైతులు అధికంగా ఉన్నారు. వీరు ఉత్పత్తుల విక్రయానికి రైతుబజారు అందుబాటులో లేదు. నాలుగేళ్ల క్రితం స్థానిక నాగవంశంవీధి కూడలి వద్ద శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించలేదు. వడమ పరిధిలోని కల్యాణి కోనేరును రూ.38 లక్షలు, వెంకటరాయుడు కోనేరును రూ.32 లక్షలతో అభివృద్ధి చేయాలని నిర్ణయించినా పనులు జరగలేదు. కల్యాణి కోనేరు గట్టుపై రక్షణ కంచె ఏర్పాటు చేసి బోర్డు అమర్చారు. వెంకటరాయుడికోనేరులో పూడికలు తీసి వదిలేశారు.



సగంలో ఆగిన ఆరోగ్య కేంద్రం పనులు



అభివృద్ధికి నోచుకోని కోనేరు

అద్దె గదుల్లో ఆరోగ్య కేంద్రం..

పాలకొండ ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు అయిదేళ్ల క్రితం రూ.80 లక్షలతో తహసీల్దారు కార్యాలయం ఎదురుగా పట్టణ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. నేటికీ పూర్తికాలేదు. దీంతో మురళీమోహన్‌నగర్‌లో అద్దె భవనంలో సేవలు అందిస్తున్నారు. ఇరుకు గదుల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆధునిక యంత్ర పరికరాలు మూలకు చేర్చారు. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. పాలకొండలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అడుగు దూరాన.. అనుసంధానం

వంశధార-నాగావళి నదులను అనుసంధానం చేసి జిల్లాను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో ప్రారంభించిన ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 2017లోనే పనులు ప్రారంభమైనప్పటికీ వైకాపా హయాంలో నిధులు సక్రమంగా మంజూరు చేయలేదు. గత ప్రభుత్వ పాలనలో జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినా పట్టనట్లు వ్యవహరించింది. ఇప్పటివరకు ఆరు సార్లు గడువు పెంచినా ప్రగతి లేకపోవడంతో అనుసంధాన పనులపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. – న్యూస్‌టుడే బూర్జ, ఆమదాలవలస గ్రామీణం, శ్రీకాకుళం అర్బన్

● పట్టిసీమ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వంశధార-నాగావళి నదుల అనుసంధానానికి 2017లో రూ.89.90 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. 2019లో సాధారణ ఎన్నికల నాటికి సుమారు 60 శాతం పూర్తి చేశారు. ఆ తరువాత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో 20 శాతం మాత్రమే చేసింది. పనుల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో అంచనా విలువ రూ.145 కోట్లకు పెరిగింది.

ఇదీ పరిస్థితి..

- బూర్జ మండలం లచ్చయ్యపేట వద్ద సుమారు 10 మంది రైతుల నుంచి ప్రభుత్వం భూములు తీసుకున్నప్పటికీ పరిహారం అందించడానికి చర్యలు తీసుకోలేదు.
- గంగంపేట నుంచి నారాయణపురం వరకు వయోడెక్టు నిర్మించాలని రైతులు, ప్రజలు వైకాపా ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అప్పటి సభాపతి తమ్మినేని సీతారాంను కోరారు. స్థలం అనువుగా లేదని లోతట్టు ప్రాంతంలోని గ్రామాలు ముంపునకు గురికాకుండా.. పంటలకు వరద నష్టం లేకుండా యూటీ నిర్మాణం దిశగా అడుగులు వేసినప్పటికీ ఆదిలోనే ఆయా పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై సరైన నిర్ణయం తీసుకోకపోతే ఎగువన ఉన్న సుమారు 10 గ్రామాలు నీట మునిగే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.
- వంశధార-నాగావళి అనుసంధానం ప్రాజెక్టుకు సంబంధించి చేసిన పనుల వరకు బిల్లు ఇప్పించాలని కోరుతూ రెండు నెలల కిందట గుత్తేదారు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దీనిపై సమీక్షించి పనులు పూర్తి చేయాలని ఆయనకు సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి హెచ్‌ఎల్‌సీ పనుల పరిస్థితిని ఆరా తీయడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.



బూర్జ మండలం గంగంపేట వద్ద పనికిరాని మొక్కలతో నిండిన అనుసంధాన కాలువ

చేపట్టాల్సిన పనులు

ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తయినా చాలా వరకు అసంపూర్తిగా ఉన్నాయి. 33.583 కి.మీ. మేర కాలువకు సుమారు 30 కి.మీ.మేర మట్టి పనులు పూర్తయినా దారి పొడవునా పనికిరాని మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. 3.583 కి.మీ పనులు వివిధ కారణాలతో ప్రారంభించలేదు. కాలువపై చేపట్టాల్సిన 66 నిర్మాణాలకు 34 పూర్తయ్యాయి. మరో 23 వివిధ దశల్లో ఉన్నాయి. 7 నిర్మాణాలను ప్రారంభించాలి. గేట్లు, హెడ్ రెగ్యులేటర్లు, క్రాస్ రెగ్యులేటర్లు, 10 డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.



సింగన్నపాలెం సమీపంలో అసంపూర్తిగా కాలువ నిర్మాణం

ఉన్నతాధికారులకు నివేదించాం..

నాగావళి వంశధార అనుసంధాన పనులను ప్రభుత్వం ప్రాధాన్య ప్రాజెక్టు జాబితాలో చేర్చింది. ఇటీవల పాత ధరకు పనులు చేయలేనని గుత్తేదారు లేఖ రాశారు. దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. – కేవీఎన్ స్వర్ణకుమార్, ఎస్‌ఈ, వంశధార సర్కిల్ కార్యాలయం, శ్రీకాకుళం

● అనుసంధాన పనులు పూర్తయితే నారాయణపురం ఆనకట్ట కింద ఉన్న ఏడు మండలాల్లోని 102 గ్రామాల పరిధిలో 37,053 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. కొత్తగా మరో 5 వేల ఎకరాలకు సాగునీరు లభ్యమవుతుంది. ఓవీపేట పరిధిలో ఎత్తిపోతల పథకం నిర్మించి మరో 600 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం..

వంశధార-నాగావళి నదుల పనులను కూటమి ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. కాలువలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందుతుంది. ఈ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలి. – పేడాడ అప్పాజీ శ్రీనివాస్, రైతు, లాభాం, బూర్జ మండలం

- చొరవ తీసుకుంటేనే నాగావళి- వంశధార కలిసేది
- కూటమిపైనే రైతుల ఆశలు

పూర్తిగా విస్మరించారు..

వైకాపా హయాంలో అనుసంధాన పనులను పూర్తిగా విస్మరించారు. కాలువల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. రైతుల పొలాలు, నారాయణపురం ఆనకట్టకు సాగునీరు సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకుంటాం.

- కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

పశు సంపదతో ఆర్థికాభివృద్ధి



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో పశుసంపద వృద్ధి చెంది పోషకులు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం పార్వతీపురంలో పశుగణన కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ అధికారి మన్మథరావుతో కలిసి ప్రారంభించారు. గతంలో జిల్లాలో 2.29 లక్షల పశువులు, 0.47 లక్షల గేదెలు, 2.07 లక్షల గొర్రెలు, 1.73 లక్షల మేకలు, 8.11 లక్షల కోళ్లు కలిపి 14.67 లక్షలు ఉండేవని డీఏహెచ్‌వో తెలిపారు. ప్రస్తుతం వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం పశుగణన గోడప్రతులు ఆవిష్కరించారు. పశువైద్య ఏడీలు శ్రీనివాసరావు, ప్రసాదు, సిబ్బంది పాల్గొన్నారు.